క్లుప్తంగా

దీపాల వెలుగుల్లో రంగనాథస్వామి దర్శనం



దీపాల వెలుగులో స్వామి

చేబ్రోలు: సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా చారిత్రక ప్రసిద్ధి చెందిన చేబ్రోలులోని మోహన రంగనాథస్వామి దేవస్థానంలో ఆదివారం తెల్లవారుజామున దీపాల వెలుగులో మోహన రంగనాథస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక భక్త బృందం ఆలయ ప్రాంగణం, వివిధ రకాల ఆకారాల్లో దీపాల్ని వెలిగించారు. శంకు, చక్రం, నామాల ఆకారంలో వెలుగులు విరజిమ్మాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ధనుర్మాసం సందర్భంగా అర్చకులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఫెన్సింగ్ పోటీల్లో బ్రిజేష్ మణికి పతకం



కోచ్ సంగీత్‌బాబుతో బ్రిజేష్ మణి

ప్రత్తిపాడు: ఇటీవల సంధ్యాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడుకు చెందిన బత్తుల బ్రిజేష్ మణి అండర్–24 విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరచి కాంస్య పతకం సాధించినట్లు పాఠశాల కోచ్ సంగీత్ బాబు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు ,గ్రామస్తులు మణికి అభినందనలు తెలియజేశారు.

నేడు నగరపాలక సంస్థ కార్యాలయంలో స్పందన

నెహ్రూనగర్: స్థానిక సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కీర్తి చేకూరి ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయాల్లోనూ రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు కూడా స్పందన జరుగుతుందని, స్థానికంగా పరిష్కారం కాని సమస్యలపై అక్కడ కూడా నేరుగా ఫిర్యాదులు అందజేయవచ్చని సూచించారు.

సీతారామస్వామి దేవస్థానం చైర్మన్‌గా వెంకట్రావు



కొరిటెపాడు(గుంటూరు): ఏటుకూరు రోడ్డులోని డీఎస్‌నగర్‌లో గల శ్రీ సీతారామ స్వామి దేవస్థానం నూతన చైర్మన్‌గా యేనుగంటి వెంకట్రావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఏడాది పాటు పదవిలో కొనసాగనున్నారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ దేవస్థానం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ఆయనకు ముప్పాళ్ల శ్రీనివాసరావు(వాసు), కట్టా ఏడుకొండలు, యాగంటి పోలయ్య, యేనుగంటి ముని అభినందనలు తెలిపారు.

త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం



పాత గుంటూరు: లక్ష్మీపురంలోని శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో 176వ ఆరాధనోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. సభలో ముఖ్య అతిథిగా డాక్టర్ వేమూరి రామ్ తారక్‌నాథ్ పాల్గొని సంఘం పుస్తకాన్ని ఆవిష్కరించారు. స్థానిక కళాకారుల త్యాగరాజ కీర్తనల కచేరీలు ఆకట్టుకున్నాయి. హైదరాబాద్‌కు చెందిన డి. రవికాంత్ త్యాగరాజ కీర్తనల సంగీత కచేరి అలరించింది. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు డాక్టర్ రామరాజు శ్రీనివాస్, సహాయ కార్యదర్శులు వి. కృష్ణకిశోర్, ఎస్.గిరిజాశంకర్, న్యాయవాది సాయికృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళను వేధించిన ఘటనపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఓ మహిళను భర్త, అత్తమామలు వేధించి ఇంట్లో నుంచి తరిమివేసిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు... కృష్ణాజిల్లా కంచికచర్లకు చెందిన డానియల్ కుమార్‌కు గుంటూరులోని వసంతరాయపురానికి చెందిన స్వాతికి 4 సంవత్సరాల కిందట వివాహమైంది. భర్త, అత్తమామలు స్వాతిని వేధించి కొట్టి, ఇంటి నుంచి తరిమి వేశారు. దీంతో వసంతరాయపురంలోని పుట్టింటికి వచ్చేసింది. ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమ సారథి సీఎం జగన్

- ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- ఉప్పరపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి స్పందన
- పూలబాటలు వేసి స్వాగతం పలికిన గ్రామస్తులు



ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

పొన్నూరు: దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఏపీలో అనేక సంక్షేమ పథకాల్ని ప్రవేశపెట్టి పేదల పక్షపాతిగా, సంక్షేమ సారథిగా సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తున్నారని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని ఉప్పరపాలెంలో ఆదివారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యాక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పూలబాటలు వేసి స్వాగతం పలికారు. ప్రతి ఇంటింటికీ ఎమ్మెల్యే వెళ్లారు. ఇప్పటి వరకు సీఎం వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పేదలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించి, బుక్‌లెట్‌ను అందించారు. తిరిగి వైఎస్సార్ సీపీని ఆదరించాలని కోరారు. గ్రామస్తులు విద్యుత్ సమస్య, మురుగు నీరు పారుదలపై ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్యకు ఫిర్యాదు చేయడంతో వెంటనే విద్యుత్ శాఖ ఏఈని పిలిచి సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కాని సంక్షేమ ఫలాలు పేదలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని వివరించారు. రాష్ట్రంలో సంక్షేమ క్యాలెండర్ ప్రకటించి దాని ప్రకారం ప్రతి పథకం గడప వద్దకు వెళ్లి అందిస్తున్నామని చెప్పారు. ఏ గడప వద్దకు వెళ్లినా సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలన మరలా రావాలని ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. పేదలకు ప్రభుత్వం నివేశ స్థలాలు కులం, మతం, వర్గం, పార్టీలు చూడకుండా అర్హతను చూసి ఇచ్చామని వివరించారు. దేశంలో ప్రజలకు ఇచ్చిన హామీలు 98.4శాతం అమలు చేసిన నాయకుడు ఒక్క వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

చంద్రబాబు–పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు హాస్యాస్పదం

చంద్రబాబు–పవన్ కల్యాణ్‌లు ప్రజాస్వామ్యంపై మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య విమర్శించారు. కందుకూరు, గుంటూరు సంఘటనలలో అమాయక ప్రజలు మృతి చెందారన్నారు. దీని కోసం ప్రభుత్వం జీవో నంబర్ 1ని తీసుకు వస్తే, ప్రజాస్వామ్యంపై మాట్లాడటం విడ్డూరంగా ఉందని తెలిపారు. 40 సంవత్సరాలు రాజకీయ అనుభవం, 14 సంవత్సరాల సీఎంగా చంద్రబాబు ప్రజల కోసం చేసిన సంక్షేమ పథకం ఒక్కటీ కూడా లేదని విమర్శించారు. చంద్రబాబు–పవన్ కళ్యాణ్ కలుస్తారని ప్రజలకు ఎప్పుడో తెలుసన్నారు. దమ్ము, ధైర్యం ఉంటే రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమ పథకాలపై మాట్లాడాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మారుతి శేషమాంబ, ఈఓపీఆర్‌డీ శివ సుబ్రహ్మణ్యం, తాడిశెట్టి మురళి, సర్పంచ్ ముద్రబోయిన తిరుపతయ్య, నందకుమార్, రాధాకృష్ణ, పరమాత్మ, వెంకట రమణ, సుధాకర్, ప్రసాద్, దుర్గారావు, యతిరాజు పాల్గొన్నారు.

వినియోగదారుల రక్షణ చట్టంపై విస్తృత ప్రచారం



సమావేశంలో మాట్లాడుతున్న చేకూరి రాజశేఖర్

కొరిటెపాడు(గుంటూరు): రాష్ట్రంలో వినియోగదారుల రక్షణ చట్టం– 2019 ఆవశ్యకత గురించి విస్తృతంగా ప్రచారం చేస్తామని దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు చేకూరి రాజశేఖర్ తెలిపారు. గుంటూరులోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఆదివారం దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ త్వరలో తూనికలు, కొలతలు, నాసిరకం మందులు, బంగారు ఆభరణాల హోల్ మార్కింగ్‌ల చైతన్య సమాచారంతో కూడిన వినియోగదారుల హక్కుల ప్రచార రథాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లా, మండల స్థాయిలలో పూర్తిస్థాయి వినియోగదారుల కమిటీలను ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు. సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో సమితి నాయకులు చదలవాడ హరిబాబు, సీహెచ్. చక్రపాణి, సీనియర్ న్యాయవాది ఆర్.ఆనందరావు పాల్గొన్నారు.

నేడు ప్రజా సంకల్ప యాత్ర వేడుకలు

పొన్నూరు: సీఎం జగన్ ప్రజా సంకల్ప యాత్ర నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వేడుకలు నిర్వహిస్తున్నట్లు పార్టీ కార్యాలయ వర్గాలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పాల్గొంటారని పేర్కొన్నారు. ఆయన సోమవారం ఉదయం 7 గంటలకు ఉప్పరపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రెండో రోజు కొనసాగిస్తారని, అనంతరం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేక్ కటింగ్‌లో తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్దసంఖ్యలో పాల్గొనాలని సూచించారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ



నగరంపాలెం: ఆదరణ కోల్పోయిన వృద్ధులు, దివ్యాంగులకు తమ వంతుగా సహాయం అందిస్తున్నట్లు శ్రీ హనుమాన్ ఆదర్శ సేవా సమితి అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ తెలిపారు. కొత్తపేటలోని జానీ కాంప్లెక్స్ ఆవరణలోని సమితి కార్యాలయంలో ఆదివారం వంద మందికి దివ్యాంగులు, వయోవృద్ధులకు ఉచితంగా 11 రకాల నిత్యావసర వస్తువులు, దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగుల్ని ఆదుకునేందుకు దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో దాతలు వెంకట సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు మాదాల ప్రకాష్, పోలేపల్లి వెంకటసుబ్రహ్మణ్యం, మురళీసాయి, మామిడి ప్రతీక్, మామిడి శ్రావణ్, పోలేపల్లి లహరి, గణేష్, స్నేహిత పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



రోగులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్న సిబ్బంది

నగరంపాలెం: పొన్నూరు రోడ్డులోని చంద్రబాబు కాలనీలో జీఎస్ క్లినిక్ అండ్ ల్యాబ్, నవాజ్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. జ్వరంతో, ఇతరత్రా వ్యాధులతో బాధపడుతున్న రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ల్యాబ్ డైరెక్టర్ బషీరున్నీసా, పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా రామానుజాచార్యుల పుష్పాలంకరణ



స్వామివారికి ఊరేగింపుగా పుష్పాలు తీసుకెళుతున్న భక్తులు

తెనాలి టౌన్: పట్టణ వీఎస్ఆర్ కాలేజ్ రోడ్డు వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ధనుర్మాస వ్రత మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. శ్రీ రామానుజదాస స్వామి పర్యవేక్షణలో శరణాగతి గోష్ఠి వారి ఆధ్వర్యంలో భగవత్ రామానుజాచార్యుల వారికి ఆదివారం పలు రకాల పుష్పాలతో పూజలు చేశారు. భక్తులు పుష్పాలను బుట్టల్లో తీసుకువచ్చారు. పూజల అనంతరం స్వామివారికి రథంపై ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవాల్లో రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, ప్రియదర్శిని విద్యా సంస్థల చైర్మన్ చందు రామారావు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు నిర్వాహకులు అన్నప్రసాద వితరణ చేశారు.

జీజీహెచ్‌లో అన్నదానం

గుంటూరు మెడికల్: ఆల్ ఇండియా పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ విజయవాడ యూనిట్ ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరు జీజీహెచ్‌లో అన్నదానం చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉచిత భోజన కార్యక్రమాన్ని ప్రారంభించి నిర్వాహకుల్ని అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ పి. నారయ్య, ప్రెసిడెంట్ షేక్ గౌస్, ది న్యూ భారతి ఎక్స్‌రే అండ్ ల్యాబ్ గుంటూరు అధినేత యు. నాగభూషణం పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎంపీ సంజీవ్ కుమార్

తెనాలి అర్బన్: పద్మశాలీ వేల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ముత్తెంశెట్టిపాలెంలోని కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి కర్నూలు ఎంపీ డాక్టర్ సింగిరి సంజీవ్ కుమార్ పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పద్మశాలీ వెల్ఫేర్ సొసైటీ ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు జొన్నాదుల నరసింహారావు, డాక్టర్ దివి చైతన్య, దివి శ్రీనిధి, అక్కల శ్రీరామ్, మహేష్, విద్యాసాగర్, భాస్కరరావు, శేషగిరిరావు, ప్రభాకరరావు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు

మంగళగిరి: ముగ్గురు రాజుల పండుగ సందర్భంగా చిలువూరు ఆర్‌సీఎం స్కూల్ ఆవరణలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వైజ్ఞానిక విప్లవం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలు ఆదివారం ఉత్కంఠగా సాగాయి. పోటీల్ని మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు మాదిగ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి అరుణ, ఎంపీటీసీ సభ్యురాలు మరియ రోజమ్మ, రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ కట్టిపోగు బసవరాజు, రాష్ట్ర మానవ హక్కుల సంఘం నాన్ జ్యుడీషియల్ మెంబర్ గోశపాతు శ్రీనివాసరావు, మల్లవరపు నాగయ్య పాల్గొన్నారు.

లారీని ఢీకొని ద్విచక్ర వాహనదారుడి దుర్మరణం

కృష్ణలంక(విజయవాడతూర్పు): రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. గుంటూరు జిల్లా తెనాలిలోని మారీసు పేటకు చెందిన మీసాల సాయిచరణ్‌తేజ్ (26)మొబైల్ ఫోన్ షాపు నిర్వహిస్తున్నాడు. ఆయనకు సంవత్సరం క్రితం వివాహమైంది. శనివారం ఉదయం పని నిమిత్తం తన ముగ్గురు స్నేహితులతో కలిసి రెండు ద్విచక్ర వాహనాల్లో నగరానికి వచ్చారు. పని ముగించుకుని ఉదయం 4.30 గంటల సమయంలో తెనాలికి వెళ్లే క్రమంలో సాయి చరణ్ తేజ్ ద్విచక్ర వాహనాన్ని నడుపుతుండగా స్నేహితుడు రోషన్ వెనుక వైపు కూర్చున్నాడు. సత్యంగారి హోటల్ సమీపానికి రాగానే రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన లారీని ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనం పైనుంచి ఇద్దరూ కింద పడిపోయారు. సాయిచరణ్‌తేజ్ అక్కడికక్కడే మృతి చెందగా రోషన్ స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మానవతా సేవా సమితి సేవలు స్ఫూర్తిదాయకం



కార్యక్రమంలో మాట్లాడుతున్న పీఎస్ఎస్ ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాస్

గుంటూరు రూరల్: అనాథలు, వృద్ధుల సేవలో మానవతా సేవా సమితి ట్రస్ట్ 25 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం స్వచ్ఛంద సంస్థలకు స్ఫూర్తిదాయకమని హైదరాబాద్‌కు చెందిన పీఎస్ఎస్ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ పి.శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం నగర శివారుల్లోని రెడ్డిపాలెం ఇన్నర్ రింగ్‌రోడ్డునందున్న మానవతా సేవా సమితి, రాజేంద్ర సూరిజైన్ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో వృద్ధుల ఆశ్రమ రజతోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తోటివారికి సహాయ సహకారాలు అందించేందుకు ముందుకు రావాలని కోరారు. పి. మంగీలాల్ జైన్ మాట్లాడుతూ 1998లో పగిడిమర్రి సత్యనారాయణ, షేక్ అబ్దుల్ రెహమాన్, వేములకొండ చంద్రం మిత్రుల బృందం స్థాపించిన మానవతా సేవా సమితి నేటికి వరకూ ఎందరో వేలాది మంది అనాథ వృద్ధులకు, పిల్లలకు ఉచితంగా వసతి, భోజన, అల్పాహారంతో పాటు వైద్య సేవలు అందిస్తూ, వారికి నూరేళ్ల జీవితాన్ని భరోసాగా అందించడం అభినందనీయమని తెలిపారు. అనంతరం ఆశ్రమంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో సేవా సమితి ప్రధాన కార్యదర్శి సురేష్ సోలంకి, అమ్మ ఆశ్రమం ప్రతినిధి అయ్యప్పరాజు, మానవతా సేవా సమితి ప్రధాన కార్యదర్శి చెన్నంశెట్టి రామారావు, కార్యవర్గ సభ్యులు, పలు స్వచ్ఛంద సంస్థలల ప్రతినిధులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

పౌష్టికాహారలోపంతో గర్భిణులలో దుష్పరిణామాలు



మందులు అందిస్తున్న డాక్టర్ బూసిరెడ్డి దీప్తిరెడ్డి

గుంటూరు మెడికల్: గర్భిణులో పౌష్టికాహారలోపం కారణంగా అనేక దుష్పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉందని సాయిభాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రసూతి, గర్భకోశ వ్యాధుల వైద్యనిపుణురాలు డాక్టర్ బూసిరెడ్డి దీప్తిరెడ్డి తెలిపారు. ఆదివారం పెదకాకాని మండలం కొప్పురావూరులో ఉన్నతి ఫౌండేషన్, సాయి భాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దీప్తి రెడ్డి మాట్లాడుతూ గర్భం దాల్చిన అనంతరం వైద్యుల పర్యవేక్షణ ఎంతైనా అవసరమని, శరీర అవసరాలకు అనుగుణంగా వైద్యుల సలహా మేరకు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు దీని ప్రాధాన్యతను అంతగా పట్టించుకోరని, పుట్టే బిడ్డపై పౌష్టికాహార లోప ప్రభావం చాలా ఉంటుందని పేర్కొన్నారు. గర్భం దాల్చిన తర్వాత తల్లితోపాటు లోపలి శిశువును దృష్టిలో పెట్టుకుని అవసరమైన పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. గర్భానంతరం షుగర్ వచ్చే అవకాశముందని, దీని గురించి భయపడకుండా తరచూ వైద్యుల్ని సంప్రదించి సలహాలు తీసుకోవాలని చెప్పారు. నెలసరి క్రమంగా రాకపోయినా, వైట్ డిశ్చార్జి అవుతున్నా అశ్రద్ధ చేయకుండా వైద్యుల్ని సంప్రదించాలని సూచించారు. పలువురి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు కూడా అందజేశారు. కార్యక్రమంలో కొప్పురావూరు సర్పంచ్ ఆలా సాంబశివరావు, విశ్వశాంతి హైస్కూల్ ప్రిన్సిపాల్ వై.వి. కృష్ణారావు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎడ్యు లీడర్ అవార్డు అందుకున్న మట్టుపల్లి మోహన్



ఎడ్యులీడర్ అవార్డుతో మట్టుపల్లి మోహన్

గుంటూరు ఎడ్యుకేషన్: భారతదేశంలో ప్రముఖ బ్రెయిన్ ఫీడ్ మేగజైన్ ఈనెల 4, 5వ తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ సదస్సులో మాస్టర్‌మైండ్స్ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ ప్రతిష్టాత్మక ఎడ్యు లీడర్ అవార్డు అందుకున్నారు. మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థల ద్వారా గత 20 ఏళ్లుగా ఎంఈసీ, సీఏ, సీఎంఏ కోర్సులను బోధిస్తూ తారస్థాయిలో విజయాలను, ఫస్ట్ ర్యాంకులను సాధిస్తూ దేశంలోనే అతి పెద్ద కామర్స్ విద్యాసంస్థగా నిలిపినందుకు ఈ అవార్డు వరించినట్లు మట్టుపల్లి మోహన్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఆయన్ను ఘనంగా సత్కరించారు.

సర్వేలో మొదటి స్థానం నగరానికి గర్వకారణం

నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: కేంద్ర ప్రభుత్వ సిటిజన్ పర్సెప్షన్ సర్వే (పౌరుల అవగాహన)లో గుంటూరు నగరపాలక సంస్థ రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో, జాతీయ స్థాయిలో 6వ స్థానంలో నిలవడం గుంటూరు నగరానికి గర్వకారణమని కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వేలో నగరానికి మంచి ర్యాంక్ రావడం ద్వారా నగరంలో పలు అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా నిధులు మంజూరు అయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. సర్వేపై నగర ప్రజలకు అవగాహన కలిగించి, దేశస్థాయిలో అత్యుత్తమ స్థానంలో నిలిచేలా నోడల్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు టీం వర్క్‌తో కృషి చేశారని కొనియాడారు. సర్వే ద్వారా నగర అభివృద్ధి, మౌలిక వసతులపై నగర ప్రజల అభిప్రాయాలు కూడా తెలుసుకోవడానికి నేరుగా అవకాశం కలిగిందని కమిషనర్ పేర్కొన్నారు. సర్వేలో భాగస్వాములైన నగర ప్రజలు, సచివాలయ కార్యదర్శులకు, సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

వాసవీ మాత ఆలయంలో శిలాఫలకం ఆవిష్కరణ



శిలాఫలకం ఆవిష్కరణలో పాల్గొన్న కాంతారావు, నరసింహారావు తదితరులు

పాత గుంటూరు: గంటలమ్మ చెట్టు వీధిలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం భూరి విరాళ ప్రధాన దాత, క్రేన్ సంస్థల అధినేత గ్రంధి కాంతారావు శిలాఫలక ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా గ్రంధి కాంతారావు పాల్గొన్నారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించిన అనంతరం 108 మంది ముత్తయిదువలకు పసుపుకుంకుమ అందించారు. కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్షుడు కొత్తూరి వెంకట నరసింహారావు, కార్యదర్శి తెల్లాకుల గురుప్రసాద్, కోశాధికారి పెనుగొండ వెంకట శ్రీనివాసరావు, సాతులూరి ప్రకాశరావు, డోగిపర్తి సుజాత, మట్టుపల్లి శరణ్, ఆర్యవైశ్య ప్రముఖులు, పాలకవర్గ సభ్యులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

అలరించిన విద్యార్థినుల కూచిపూడి నృత్యం



నృత్య ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థినులు

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం పద్మావతి కల్యాణ మండపం వేదికగా సంస్కార భారతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భరత మాత పూజ దినోత్సవాల్లో భాగంగా ఆదివారం విద్యార్థినుల కూచిపూడి నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఈ సందర్భంగా వందేమాతరం రాత పోటీలు, రంగోలి పోటీలు, కూచిపూడి బృంద నృత్యాలు నిర్వహించారు. పలు ప్రాంతాలకు చెందిన విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని సంస్థ అధ్యక్షుడు ఇండ్ల శ్రీధర్ బాబు పర్యవేక్షించారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి



వీరారెడ్డి మృతదేహం

పొన్నూరు: ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. నగరం మండలం పూడివాడ గ్రామానికి చెందిన అక్కల వీరారెడ్డి(35) నిడుబ్రోలులోని జగనన్న కాలనీలో నూతనంగా నిర్మించుకున్న ఇంటిలో ఈనెల 7న పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు పొన్నూరు పట్టణంలోని ఒక ప్రైవేట్ వైద్యశాలలో చేర్చారు. అక్కడే చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి వీరారెడ్డి మృతి చెందాడు. అతడు మండలంలోని చింతలపూడిలో రెండు ఎకరాల తమలపాకు తోటను కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. పొలం ఖర్చుల కోసం పలువురు వ్యక్తుల దగ్గర అప్పులు చేశాడు. వాటిని ఇచ్చిన వారు ఒత్తిడి చేయడంతో ఆత్మహత్యాయత్నం చేశాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పట్టణ ఏఎస్ఐ పీఎం సుభాని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.